క్లుప్తంగా

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా

పెద్దపప్పూరు: కాలనీలో ఎటువంటి సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఇన్‌చార్జి ఎస్‌ఐ గౌస్‌బాషా అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ కాలనీవాసులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా కులంపేరుతో దూషించినా, దాడులు చేసినా పోలీసులకు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏసుక్రీస్తు లోకానికి వెలుగై ఉన్నాడన్నారు. అజ్ఞానము అనే చీకటి నుంచి వెలుగులోనికి నడిపించువాడు దేవుడు అన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

గుత్తి రూరల్: మునిసిపాలిటీతో పాటుగా మండల వ్యాప్తంగా సోమవారం నుంచి కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ భారతి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ దుకాణాల వద్దకు ఎవరూ వెళ్లాల్సిన అవసరం లేదని ఎండీయూ వాహనాలే ఇళ్ల వద్దకే వస్తాయని కార్డుదారులు గమనించాలని ఆమె సూచించారు. ఎండీయూ వాహనాల ద్వారానే నిత్యావసరాలు పొందాలని తహసీల్దార్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



క్లాత్ బ్యాగులను పంపిణీ చేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

గుంతకల్లు రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు రేణుక సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం రోజురోజుకూ దెబ్బతింటున్న నేపథ్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్ లోగోతో తయారు చేసిన 200 బ్యాగులను కసాపురంలోని నెట్టికంటి ఆలయ సిబ్బందికి, భక్తులకు పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నివారించినపుడే పర్యావరణాన్ని కాపాడుకోగలమని వారు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వరలక్ష్మి, సభ్యులు శాంత, జయవని తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చెడుకు వాడొద్దు



ఎస్సీ కాలనీలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నబీరసూల్

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి సెల్‌ఫోన్ వాడకంపై పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నబీ రసూల్ మాట్లాడారు. సెల్‌ఫోన్‌లు వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో.. అన్ని అనర్థాలు కూడా ఉన్నాయన్నారు. సెల్‌ఫోన్‌ను మంచికి మాత్రమే వాడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చెడుకు వాడద్దన్నారు. లోన్ యాప్, డేటింగ్ యాప్, ఆన్‌లైన్‌లో కొత్త వ్యక్తులతో పరిచయాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతే కాకుండా గంజాయి, మట్కా, సారా వంటి వాటి జోలికి వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతు, రమేష్‌నాయక్, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

గుత్తి: పెండింగ్ వేతనాల కోసం గుత్తి ప్రభుత్వాసుపత్రిలో ఔట్ సోర్సింగ్ శానిటేషన్ కార్మికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ కార్మికులు వీరన్న, లింగమయ్య తదితరులు మాట్లాడుతూ ఏడు మాసాలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కుటుంబం గడవటం కష్టమైందన్నారు. పలు సార్లు కాంట్రాక్టర్‌కు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. సంబంధిత అధికారులు , కాంట్రాక్టర్ స్పందించి జీతాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

అప్రమత్తతతోనే డయేరియా నివారణ



గుత్తిలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: ప్రజలు, వైద్యసిబ్బంది డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఇళ్ల చుట్టూ శుభ్రంగా ఉండే విధంగా బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి కార్యక్రమాలు చేయాలన్నారు. ప్రజా ఆరోగ్యంపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదన్నారు. రాత్రి పూట దోమతెరలు వాడాలన్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో వైద్యున్ని సంప్రదించి చికిత్స పొందాలన్నారు.

గుంతకల్లు రూరల్: రోజురోజుకూ పెరుగుతన్న డయేరియాను నియంత్రించే క్రమంలో భాగంగా జూలై 1 నుంచి స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీర్‌కుమార్ బాబు తెలిపారు. జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి వారి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకోవడంతోపాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం ద్వారానే సీజనల్ వ్యాధులను నివారించే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల సిబ్బంది ద్వారా పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడతామన్నారు. కలుషిత నీటి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ నీటిశుద్ధిపై అవగాహన కల్పిస్తామన్నారు. రెండు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్ పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం డయేరియాపై పిల్లలు, తల్లులు, కాలనీవాసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి డయేరియా ఎలా వ్యాపిస్తుందో ? డయేరియా నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. దోమలు కుట్టకుండా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

పామిడి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామ పంచాయతీ ఈఓ పీ చంద్రశేఖర్ ఆదివారం సూచించారు. చెత్తా, చెదారం ఆరుబయట ప్రాంతాల్లో వేయరాదన్నారు. అలాగే హోటళ్లు, ఇతరత్రా గృహ వినియోగదారులు వృథా నీటిని రోడ్లపై పోయరాదన్నారు. పొడి, తడి చెత్తను వేరుచేయాలన్నారు. చెత్త సేకరించడానికి వచ్చే పారిశుధ్య కార్మికుల బండ్లలోనూ, వాహనాల్లో వాటిని వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూకాచి వడపోసి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. తద్వారా డయేరియా, మలేరియా, మొదడువాపు వ్యాధి వంటి సీజనల్ వ్యాధులు దరిచేరవన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగ విరమణ



డ్రైవర్ ఉస్మాన్‌ను సన్మానిస్తున్న కార్మికులు

గుత్తి: గుత్తి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉస్మాన్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆర్టీసీ అధికారులు, కార్మికులు ఘనంగా సత్కరించారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు పీకే రాముడు, ఎన్‌వీ రాముడు, బెల్లం శ్రీనివాసులు, పెద్దవడుగూరు శ్రీనివాసులు, గంగేశ్వర్, మధు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని పెద్దపోలమడ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన క్లైమెంట్ బాబును సహ ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్లైమెంట్‌బాబు దంపతులను పూలహారాలతో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, శివరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, రమణయ్య, శ్యామల, పుల్లారెడ్డి, షాసావలి,సుబ్రమణ్యం, నారాయణ, అరుణకుమారి, లక్ష్మీనారాయణరెడ్డి, పురుషోత్తమరెడ్డి, సుబ్బక్రిష్ణమనాయుడు, సునిత, ఓబులమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

గుంతకల్లు: స్థానిక రాజేంద్రనగర్‌లోని సెబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ ఎ.పురుషోత్తం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి పాత్రల వితరణ





కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి పాత్రలు అందజేస్తున్న దాతలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం భక్తులు వెండి పాత్రలు వితరణ చేశారు. ప్రధాన అర్చకుడు రామాచార్యులు మాట్లాడుతూ శింగనమల మండలం ఆకులేడుకు చెందిన కాశిరెడ్డి మదనమోహన్‌రెడ్డి, సావిత్రమ్మ దంపతులు స్వామికి రూ.1.33 లక్షలు విలువ చేసే వెండి అర్ఘ్య పాత్ర ఉద్ధరని వితరణ చేశారన్నారు. అలాగే అనంతపురానికి చెందిన సుబ్రహ్మణ్యేశ్వర అగ్రో ట్రేడర్స్ నిర్వాహకులు కలుగూరు దేవా, వరలక్ష్మి దంపతులు రూ.23 వేలు విలువ చేసే వెండి అర్ఘ్య పాత్ర ఉద్ధరని అందజేశారన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు అర్చకుడు ఆలయంలో మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు.

వ్యాపారి మృతి

గార్లదిన్నె: మండలంలోని మర్తాడుకు చెందిన ఓ వ్యాపారి ఆత్మహత్యాయత్నంకు పాల్పడి ఆదివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మర్తాడుకు చెందిన దూదేకుల బాబయ్య(53) అనే వ్యక్తి చీనీ కాయలు వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్టం రావడంతో రూ.20 లక్షల వరకూ రైతులకు చెల్లించాల్సి ఉంది. చీనీ కాయలు డబ్బులు ఇవ్వాలని రైతులు అడుగుతుండడంతో.. డబ్బులు లేక మధనపడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతునికి భార్య ఖైరున్‌బీ, ఇద్దరు కుమార్తెలు, కుమా రుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

యువకుడికి గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కోట కాలనీకి చెందిన షేక్షావలి బైక్‌లో గాంధీ సర్కిల్ నుంచి అనంతపురం రోడ్డు వైపు వెళుతుండగా బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నిరుపయోగంగా ఆస్పత్రి బోర్డు



చెట్ల కింద పడేసిన ఆస్పత్రి బోర్డు

యల్లనూరు: ఆస్పత్రికి ఏర్పాటు చేయాల్సిన బోర్డు మూలకు చేరింది. చెట్ల వద్ద నిరుపయోగంగా ఉంది. వచ్చే పోయే రోగులు బోర్డు ఇక్కడ ఎందుకు పెట్టారో? అని చర్చించుకుంటున్నారు. ఇంత పెద్ద బోర్డు ఎందుకు పక్కకు పడేశారని అనుకుంటున్నారు. ఆస్పత్రి ద్వారానికి ఉండాల్సిన బోర్డు మూలకు నెట్టారు. చెట్ల కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యల్లనూరు అనే పేరుతో ఉన్న బోర్డు వృథాగా పడేయడంతో రోగులు ఆగ్రహిస్తున్నారు. నిత్యం వందల మంది తిరుగుతున్న రోడ్డులో ఇలా పడేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రికి బోర్డును అమర్చాలని మండలవాసులు కోరుతున్నారు.

పెద్దమ్మ తల్లికి వెండి గొడుగు వితరణ



పెద్దమ్మ తల్లికి వెండి గొడుగు అందజేస్తున్న కుందనకోట పెద్దయ్య

యాడికి: మండల కేంద్రంలో ఉన్న పెద్దమ్మ తల్లి అమ్మవారికి ఆదివారం మండలంలోని కుందనకోట గ్రామానికి చెందిన పెద్దయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి రూ.10 వేలు విలువ చేసే 10 తులాల వెండి గొడుగును అందజేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. పెద్దయ్య కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

యాడికిలో విషాదఛాయలు

- నాలుగు రోజుల కిందట కూతురి వివాహం
- అంతలోనే క్యాన్సర్‌తో తల్లి మృతి



ఫక్రూబి(ఫైల్)

యాడికి: నాలుగు రోజుల క్రితం కూతురు వివాహం ఘనంగా చేశారు. అంతలోనే బ్లడ్ క్యాన్సర్‌తో ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. వేములపాడుకు చెందిన ఇబ్రహీం, ఫక్రుబీ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. చేనేత వృత్తితోనే జీవనం సాగిస్తున్న ఇబ్రహీం 15 సంవత్సరాల క్రితం కుటుంబాన్ని యాడికి మండల కేంద్రానికి మార్చాడు. రెండు నెలల క్రితం నుంచి ఫక్రూబి బ్లడ్ క్యాన్సర్ రావటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. నాలుగు రోజుల క్రితం కూతురు రిజ్వానా వివాహం ఘనంగా చేశారు. మెరుగైన చికిత్స కోసం ఫక్రూబీని శనివారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిది. ఫక్రూబీ మృతి చెందిన సమాచారం అందుకున్న బంధువులు శోకసంద్రంలో మునిగారు.

అశ్వత్థంలో ప్రత్యేక పూజలు





అలంకరణలో శింగరబట్లు, గణపతి, నారాయణస్వామి , స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: జేష్ఠమాసం నాలుగో ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రానికి ఆదివారం పెద్దత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శింగరబట్లు, గణపతి, అశ్వర్థనారాయణుడు, అభయాంజనేయుడు,శ్రీకృష్ణార్జులు, సీతారాములు, నవగ్రహాలు, చక్రభీమలింగేశ్వరుడు, శ్రీవల్లి సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామికి చక్కెర పొంగలను నైవేద్యం సమర్పించారు. మరికొంతమంది భక్తులు తలనీలాలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు బాలసుబ్రహ్మణ్యశర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్‌కుమార్ శర్మ, ఈఓ సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

పామిడిలో మోస్తరు వర్షం

పామిడి: పట్టణంలో ఆదివారం సాయంత్రం బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షానికి డాబా రేకులు, ఇళ్ల పీటపీ సీట్లు వంటివి ఎగిసిపడ్డాయి. ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. రోడ్లు వర్షపు నీటిమయమైయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. పాదచారులు, వాహనచోదకుల రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. కాగా వర్షంపై రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

తాడిపత్రి అర్బన్: అమ్మకు గుర్తుగా ప్రతి పౌరుడు ఓ మొక్క నాటాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆదివారం నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు. పట్టణంలోని 252వ బూత్‌లో నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మాట్లాడుతూ మొక్కలను నాటడం వలన పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంకాల్‌రెడ్డి, రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్, 252వ బూత్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, లీగల్‌సెల్ నాయకులు ఆదిశేషరెడ్డి, భీమలింగారెడ్డి, చెన్నా రంగనాయకులు, అనంత శివారెడ్డి, నరసింహారెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

గుత్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ జిల్లా నాయకులు తెగదొడ్డి తిమ్మారెడ్డి, వలి బాషా సూచించారు పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు ఏరియాలో ఆదివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు 50 మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 30 వరకూ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను సోషల్ ఆడిట్ బృందం సభ్యులు ఈ నెల 19 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారన్నారు. గ్రామసభలు సైతం నిర్వహించారన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.

నాటు సారా విక్రేత అరెస్టు

యాడికి: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. గత కొంత కాలంగా మండంలోని గుడిపాడు గ్రామ శివారులో గ్రామానికి చెందిన బోయ కంబగిరి స్వామి నాటుసారా విక్రయిస్తు న్నాడనే సమాచారంతో ఆదివారం సాయంత్రం సీఐ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా కంబగిరి స్వామిని అరెస్టు చేసి, 8 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

మహిళకు గాయాలు



గాయపడిన రత్నమ్మ

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని లచ్చానపల్లి రోడ్డులో ఉన్న జగనన్న లే అవుట్ కాలనీలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు కట్టెల పొయ్యి నుంచి మంటలు చెలరేగి రత్నమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు.. రత్నమ్మ కట్టెల పొయ్యి మీద వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఆమె చీరకు వ్యాపించి కాళ్లు కాలాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చిన్నారికి ఆర్థికసాయం

తాడిపత్రి అర్బన్: బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ చిన్నారి వైద్య ఖర్చుల కోసం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆర్థికసాయం చేశారు. వివరాలు.. యల్లనూరు మండలం చిలమకూరుకు చెందిన గంగరాజు కూతురు ప్రణతి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. ప్రస్తుతం చిన్నారి ప్రణతి బోన్ క్యాన్సర్ బారిన పడింది. నిరుపేద కుటుంబం కావడంతో చిన్నారి తండ్రి గంగరాజు తన కూతరు చికిత్స కోసం నానా తంటాలు పడుతుండడంతో గమనించిన తాడిపత్రికి చెందిన కస్తూరి ట్రేడర్స్(లలిత షోరూం) యజమాని రాజగోపాల్ దంపతులు ఆదివారం చిన్నారి ప్రణతి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 వేలు నగదు అందజేశారు.

బీటీపీలో చేపల వేట నిషేధం

గుమ్మఘట్ట: మండలంలోని భైరవాని తిప్ప (బీటీ) ప్రాజెక్టు రిజర్వాయర్‌లో చేపల వేటను రెండు నెలల పాటు నిషేధించినట్లు మత్స్య అభివృద్ధిశాఖ అధికారి ఎస్‌ఎన్ లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు 31 వరకూ ప్రభుత్వ నిబంధనల మేరకు చేపల వేట నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి పింఛన్ పంపిణీ



పింఛన్ల పంపిణీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శులు

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని బసినేపల్లి, జక్కలచెరువు, కరిడికొండ, వన్నేదొడ్డి గ్రామాల్లో పింఛన్ల పంపిణీ, పెంపుపై లబ్ధిదారులకు గ్రామ కార్యదర్శులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకటేష్, ప్రవీణ్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్లవద్దనే ఉండాలని, సచివాలయ ఉద్యోగులు వచ్చి పింఛన్ అందజేస్తారన్నారు.

గార్లదిన్నె: గ్రామ సచివాలయం సిబ్బంది ద్వారా సోమవారం లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు సోమవారం ఉదయం నుంచి పింఛన్ పంపిణీ చేస్తామని ఎంపీడీఓ గోపీకృష్ణ ఆదివారం తెలిపారు. పింఛన్ల పంపిణీని నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.